క్లుప్తంగా

అంకమ్మ సేవలో ఆదాల, మేకపాటి



రాపూరు అంకమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఆదాల, మేకపాటి

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువై ఉన్న అంకాళ పరమేశ్వరిని నెల్లూరు మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండేటి రంగారెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ ధర్మకర్త పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి స్వాగతం పలికి పూజలు, తీర్థ ప్రసాదాలు అందించారు. వారి వెంట స్వర్ణ వెంకయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద చేపట్టే ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీఓ గిరిబాబు సూచించారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం అన్ని పంచాయితీలకు చెందిన క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

రాపూరు: మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి సోమసుందర్ తెలిపారు. రాపూరు మండలం సిద్ధవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవామృతంతో భూమి సారం పెరుగుతుందన్నారు. జీవామృతం ఎలా తయారు చేసుకోవాలో రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ సిబ్బంది వెంకటాద్రి, శ్రీనివాసులు, బాలయ్య, నందిని, బుజ్జమ్మ, ఉమా, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ అధికారుల తనిఖీలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలో బుధవారం నెల్లూరు జిల్లా జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని బజారు వీధిలో ఉన్న ఎస్ఆర్ జ్యూవెలరీ దుకాణంలో జీఎస్టీ అండ్ కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. అధికారులను వివరణ కోరగా సాధారణంగానే తనిఖీలు చేసినట్లు తెలిపారు. అధికారులు తనిఖీలు చేస్తుండడంతో పట్టణంలోని బంగారు దుకాణాలు అన్నీ మూతపడ్డాయి.

టిడ్కో గృహాల పరిశీలన

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే నిర్మించి ఉన్న టిడ్కో గృహాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, బ్యాంకు అధికారులతో కలిపి పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్‌టీఆర్ నగర్‌కు సంబంధించిన గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు. లబ్ధిదారులు వారి పరిధిలోని సచివాలయాల వద్ద ప్లానింగ్ కార్యదర్శుల వద్దకు వెళ్లి తిరిగి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు.

చేతివృత్తుల విభాగం అధ్యక్షుడిగా రఘురామయ్య

చిల్లకూరు: గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ చేతివృత్తుల విభాగం అధ్యక్షుడిగా విగ్రహాల రఘురామయ్య నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు: మండలంలోని మోదుగులపాళెం గ్రామానికి చెందిన దువ్వూరు చెర్రీ(18) మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం బుధవారం బంధువులకు అప్పగించారు. మంగళవారం 71వ నంబరు జాతీయ రహదారి మార్గంలో పెన్నేపల్లి గ్రామ సమీపంలో స్వర్ణముఖి అపార్ట్‌మెంట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చెర్రీ మృతి చెందిన విషయం తెలిసిందే.

నేతల పరామర్శ



సూళ్లూరుపేట: దువ్వూరు చెర్రీ వైఎస్సార్ సీపీ దళిత నాయకుడు దువ్వూరు కిష్టయ్య మనుమడు కావడంతో ఆ పార్టీ నేతలు దువ్వూరు బాలచంద్రారెడ్డి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితరులు మోదుగులపాళెం చేరుకొని చెర్రీ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చికెన్ ధరలు		04-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	110
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	204
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	226
లేయర్ చికెన్	:	210

ప్రభుత్వ విద్య నిర్వీర్యం



తుంగమడుగు ప్రాథమిక పాఠశాల ప్రధాన ద్వారం



పాఠశాల ఆవరణలో దుస్థితి

- విలీనం పేరుతో పాఠశాల ఎత్తివేత
- ప్రైవేటు వైపు విద్యార్థులు
- నాడు–నేడు పనులకు గ్రహణం

దొరవారిసత్రం: గత ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ బడులకు తొలి ప్రాధాన్యమిచ్చింది. మన బడి నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు, వసతులతో ఎంతో అందంగా తీర్చి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సిద్ధం చేశారు. అయితే రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో పలు పాఠశాలలను మూతవేసింది. నాడు–నేడు కింద అభివృద్ధి చెందిన పాఠశాలలు సైతం మూతబడ్డాయి. దీంతో గ్రామాల్లోని పేద విద్యార్థులకు చదువులు దూరాభారం కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుంగమడుగులో...

దొరవారిసత్రం మండలం ప్రాంతంలో మారుమూల ప్రాంతమైన వెదురుపట్టు పంచాయతీ తుంగమడుగు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను విలీనం చేసింది. కూటమి ప్రభుత్వం స్థానికంగా ఉన్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను బయటి ప్రాంతంలోని పాఠశాలలకు తరలించారు. స్థానికంగా ఉండాల్సిన 1, 2 తరగతుల విద్యార్థులు లేరనే నెపంతో ఈ పాఠశాలను పూర్తిగా ఎత్తివేశారు. దీంతో తుంగమడుగు పాఠశాల గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా మారింది. పాఠశాల ఆవరణం అంతా పిచ్చి మొక్కలు, చెట్లుతో నిండిపోయి అత్యంత దారుణంగా దర్శనమిస్తోంది. గత ప్రభుత్వం విద్యార్థుల కోసం తుంగమడుగు ప్రాథమిక పాఠశాలను మన బడి నాడు–నేడు కింద రెండు విడతలుగా సుమారు రూ.10 లక్షలు వెచ్చించి ప్రహరీ, ఫుట్‌పాత్, భవన మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు నిర్మాణం తదితర సౌకర్యాలు కల్పించింది. ఎంతో చక్కగా నిర్మించడంతో ఆహ్లాదకరమైన వాతావరణం వచ్చేలా పాఠశాలను తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వ విలీనం పేరుతో ఇక్కడ విద్యను అభ్యసించే విద్యార్థులను సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బుచ్చినాయుడుకండ్రిగ మండలం పుత్తేరి గ్రామం, సూళ్లూరుపేట మండలం మంగళంపాడు గ్రామాల్లోని పాఠశాలల్లో చేరాలని సూచించారు. అంత దూరంలో ఉన్న పాఠశాలలకు తమ పిల్లలను పంపలేక విద్యార్థుల తల్లిదండ్రులు చేసేది ఏమీ లేక ప్రైవేటు పాఠశాలల్లో 10 మంది విద్యార్థులను చేర్పించి చదివిస్తున్నారు. కొందరు విద్యార్థులు అయితే దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లలేక, ప్రైవేటు పాఠశాలల్లో చదివించే స్థోమత లేకపోవడంతో ఇళ్లలోనే తమ బిడ్డలు ఉండిపోయినట్లు పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఎమ్మెల్సీ మేరిగకు కాకాణి పరామర్శ



ఆనందరావు చిత్రపటానికి నివాళులలర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

రాపూరు/సైదాపురం: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మేరిగ మురళీధర్ తండ్రి మేరిగ ఆనందరావు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో మండల కేంద్రమైన రాపూరులోని లక్ష్మీపురంలో ఉన్న మేరిగ నివాసంలో మేరిగ ఆనందరావు ఉత్తరక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మురళీధర్ తండ్రి ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. అనంతరం మురళీధర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రముఖ నేతలు రాపూరుకు చేరుకున్నారు. ఇందులో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాకాణి పూజిత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ప్రముఖ నేతలు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మురళీధర్‌ను పరామర్శించారు. వారి వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, మండల కన్వీనర్లు బొడ్డు మధుసూదన్‌రెడ్డి, కార్య నిర్వహణ కార్యదర్శి దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, వలంటీర్ వింగ్ అధ్యక్షుడు దుగ్గిరెడ్డి నరసింహారెడ్డితోపాటు వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు, నెల్లూరు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ పార్టీ కన్వీనర్లు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్తరక్రియలకు హాజరయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



దుకాణదారులను హెచ్చరిస్తున్న సీఐ బాబీ, పోలీసులు

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోరి ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవంటూ సీఐ బాబీ హెచ్చరించారు. పట్టణంలోని పాత బస్టాండు నుంచి ప్రధాన వీధుల్లో రహదారులను ఆక్రమించి ఉన్న దుకాణదారులకు బుధవారం సాయంత్రం హెచ్చరికలు చేసి తొలగింపులు చేపట్టారు. ప్రధాన రహదారులను ఆక్రమించుకుని దుకాణాలను ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. పలుమార్లు హెచ్చరికలు చేసిన నిర్లక్ష్యం వహిస్తుండడంతో వాటిని తొలగించేలా చర్యలు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు. ప్రతి రోజు పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని రోడ్డును ఆక్రమించి ఉన్న వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా రహదారి ఆక్రమించి పెట్టి ఉన్న వస్తువులను తీసుకెళ్తామని సీఐ హెచ్చరికలు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుండి బుధవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ టీయూ విభాగం అధ్యక్షుడిగా గుర్రాల రమేష్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎ.ఆదినారాయణ, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా మాదినేని రత్నమ్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే మస్తాన్, పబ్లిక్ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.మోహన్‌రెడ్డి, మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.మోహన్‌కృష్ణ, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఎన్.పెంచలస్వామి, ఆర్టీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా జి.వసంతకుమార్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

చిన్నారులను ప్రిస్కూల్‌లో చేర్పించాలి



పిల్లల బరువును పరిశీలిస్తున్న జిల్లా పీడీ వసంతబాయి

చిల్లకూరు: ప్రైవేటు కాన్వెంటులకు దీటుగా ప్రిస్కూల్‌ను నిర్వహిస్తూ చిన్నారులను చేర్పించేందుకు సిబ్బంది గట్టిగా కృషి చేయాలని తిరుపతి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి సూచించారు. మండలంలోని తీర ప్రాంతంలోని బల్లవోలు, చింతవరం, ఈదలవారిపాళెం, చేడిమాల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యంతోపాటుగా వారి ఎత్తు బరువులను పరిశీలించారు. కేంద్రాలలో బాలింతలు, గర్భవతులకు ఎంత మేర పౌష్టికాహారం అందిస్తున్నారనే విషయాలను రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు. అనంతరం వారి వద్ద నుంచి వివరాలను రాబట్టారు. పిల్లల ఎత్తు, బరువును స్వయంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా బాలింతలు, గర్భవతులు, చిన్నారులలో పౌష్టికాహార లోపం లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని అన్నారు. అలాగే కాన్పు సమయంలో ఎలాంటి రక్తహీనత లేకుండా గర్భవతులకు పౌష్టికాహారంతో పాటుగా వైద్య సిబ్బంది ద్వారా ఐరన్ మాత్రలు అందించాలని సూచించారు. ఆమె వెంట నోడల్ ఆఫీసర్ వాసంతి, సీడీపీఓ ఎస్‌కే మహబూబీ, సూపర్‌వైజర్ పద్మ ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. లండన్‌లో స్థిరపడిన పారిచెర్లవారిపాళెంకు చెందిన ఎల్ఐసీ మాజీ అధికారి రామచంద్రారెడ్డి మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.అనసూయ మాట్లాడుతూ దాతలు ఇచ్చే ప్రోత్సాహాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర్, లావణ్య, జి.మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, విద్యుల్లత, కామేశ్వరి, రవీంద్ర, సుగుణ, మధుసూదన్‌రావు, డీవీ రమణయ్య, నాగభూషణమ్మ, శ్రీనివాసులు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి దారి లేకుండా కంప నాటిన ఘనుడు



మునిశేఖర్ ఇంటికి అడ్డంగా నాటిన కంప

చిట్టమూరు: మండల పరిధిలోని పిట్టివానిపల్లి గ్రామానికి చెందిన కోదాడ మునిశేఖర్‌కు చెందిన ఇంటికి అడ్డంగా ఎదురుగా ఉన్న ఓ ఇంటి యజమాని బుధవారం దౌర్జన్యంగా కంప నాటినట్లు బాధితులు వాపోయారు. బాధితుల వివరాల మేరకు 40 సంవత్సరాల క్రితం మునిశేఖర్, శ్యామ్ అనే ఇద్దరు గ్రామస్తులు గ్రామంలో కొంత స్థలం కొనుగోలు చేసి ఇద్దరు దారి వదులుకుని ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. అయితే శ్యామ్ అనే గ్రామస్తుడు మునిశేఖర్‌కు దారి లేదని ఇంటిలోకి వెళ్లనీయకుండా కంప నాటేశాడని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం ఇలాగే చేస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు, పంచాయతీ సర్పంచ్ పిట్టి ప్రవీణ్‌కుమార్ చర్చలు జరిపి, దారి ఉందని తేల్చి, దారి ఏర్పాటు చేశారు. అయితే మరలా శ్యామ్ అనే వ్యక్తి దౌర్జన్యంగా కంప నాటేశాడని మునిశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు



పోలీసుస్టేషన్‌లో సీసీ కెమెరా పర్యవేక్షణను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

వెంకటగిరి రూరల్: విధినిర్వహణలో పోలీసులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల వివరాలు, పట్టుబడిన వాహనాల సంఖ్య, సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలేరమ్మతల్లి జాతర జరిగే ముఖ్య ప్రదేశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికపై నిఘా ఉంచాలని తెలిపారు. వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరకు సంబంధించి మూడు విభాగాల్లో సిబ్బందిని కేటాయించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా 15 మందితో కూడిన స్పెషల్ క్రైమ్ టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. క్యూలైన్‌ల వద్ద, ఇతర ప్రదేశాల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి, సీఐ ఏవీ రమణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

బత్తినను పరామర్శించిన కాకాణి



బత్తిన పట్టాభిరామిరెడ్డి, కుటుంబ సభ్యులతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

రాపూరు: వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డిని బుధవారం మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కాకాణి పూజిత పరామర్శించారు. బత్తిన అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారు పరామర్శించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: మండలంలోని గిద్దలూరు గ్రామానికి చెందిన అడపాల శేఖర్‌రెడ్డి సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం గిద్దలూరు గ్రామానికి విచ్చేశారు. మృతి చెందిన శేఖర్‌రెడ్డి కుమారుడు రాజవర్ధన్, ప్రసాద్‌లను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని వ్యక్తపరిచారు. గిద్దలూరు గ్రామ పంచాయతీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు వివరించారు. ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత భాస్కర్‌రెడ్డితో కలసి పార్టీ స్థితిగతులపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బట్టేపాటి దయాకర్‌రెడ్డి, కంభం విజయభాస్కర్‌రెడ్డి, కె.మోహన్‌రావు, శివారెడ్డి, కంభం పాపిరెడ్డి, మోహన్‌రెడ్డి, యద్దల సురేష్‌రెడ్డి, దాసరి నాగిరెడ్డి, మల్లవరపు వెంకటరెడ్డి, అల్లం వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. ఇసుక, గ్రావెల్ దొంగలను శిక్షించండి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్

సూళ్లూరుపేట: అయ్యా చంద్రబాబూ ఇసుక, గ్రావెల్, సిలికా, మైన్స్ దొంగలను శిక్షించాలని మాజీ ఎంపీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ చింతా మోహన్ కూటమి ప్రభుత్వంపై వ్యంగ్యోక్తులు విసిరారు. మంగళవారం ఆయన పైన తెలియజేసిన నినాదాలతో సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు రూ.10 కోట్లు విలువ చేసే ఇసుక, కంకర, గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఇసుక, గ్రావెల్, కంకర దొంగలను అరెస్ట్ చేసి అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. మన్నవరంలో భెల్ కంపెనీ రాకుండా చేశారని ఆరోపించారు. బ్యాంకుల్లో కోట్లాది రూపాయలు అప్పులు చేసి విదేశాల్లో దాక్కున్న కొందరు బడాబాబులకు రుణమాఫీ చేసిన ఘనతను ప్రస్తుత ప్రధానమంత్రి మాత్రమే దక్కించుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాకాణితో వైఎస్సార్ సీపీ నేతల భేటీ



మాజీ మంత్రి కాకాణిని కలిసిన సంజీవయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో కాకాణికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి, సన్మానించారు. ఆ పార్టీ నాయకులు కటకం జయరామయ్య, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కలువాయి(సైదాపురం): మండలంలోని కుల్లూరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో జ్వరాలు కేసులు ఎక్కువగా ఉండడంతో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఎంపీహెచ్ఈఓ అస్లాం అహ్మద్ మాట్లాడుతూ బుధవారం ఏడుగురికి జ్వరాలు వచ్చినట్లు గుర్తించి చికిత్స అందించామని తెలిపారు. కుల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అన్వర్‌బాషా ఆదేశాల మేరకు ఈ వైద్య శిబిరం రెండు రోజుల నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వెంకటరెడ్డిపల్లి గ్రామం జంగాల కాలనీలో అన్నీ గృహాలను సందర్శించి అందరికీ ఆరోగ్య వైద్యం కల్పిస్తామని, ప్రజలు శుభ్రమైన తాగునీటిని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఇంటిలోని పరిసరాలను ఇంటి బయట పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అదేవిధంగా ప్రతి రోజు ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా లార్వాలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, దోమలు నుండి రక్షణ పొందాలని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అన్నారు. ఎంపీహెచ్ఏ సీహెచ్ పెంచలమ్మ, హెచ్‌వీకే ప్రమీల, ఎన్ఎస్ఎం యు.హరిత, ఆశాలు ధనలక్ష్మి, నాగజ్యోతి పాల్గొన్నారు.

వేడుకగా ధ్వజారోహణం





ధ్వజారోహణ కార్యక్రమం, కొడిముద్ద ప్రసాదం పంపిణీ

చిట్టమూరు: మల్లాం గ్రామంలో స్వయంభుగా కొలువైయున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం వేడుకగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రాత్రి విఘ్నేశ్వర పూజతో అంకురార్పణ గావించి ఉత్సవాలను ప్రారంభించారు. రాత్రి విఘ్నేశ్వరుడికి అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు మయూర వాహనంపై బయల్దేరి దేవేరులను ఆహ్వానించే విధానాన్ని ఆలయ ప్రధానార్చకులు మూలం భానుప్రకాష్‌శర్మ భక్తులకు కళ్లకు కట్టినట్టు వివరించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద మయూర ఆగమశాస్త్ర ప్రకారం వేద పండితులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని జరిపించారు. బ్రహ్మాది సప్తమహర్షులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం ధ్వజారోహణంలో ముఖ్య ఘట్టం. ముందుగా ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకు అలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లాం గ్రామానికి చెందిన సోమిశెట్టి సుబ్బారావు, చెవుల రోశయ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లాం గ్రామానికి చెందిన చెన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాల గ్రామపెద్దలు దగ్గరుండి పర్యవేక్షించారు.

కొడిముద్ద ప్రసాదం పంపిణీ

ధ్వజారోహణం రోజున కొడిముద్ద(అన్నం ముద్ద)ను సంతానం లేని దంపతులకు పంపిణీ చేశారు. ధ్వజారోహణం రోజు స్వామివారి ఆలయం చుట్టూ తడిబట్టలతో ప్రదక్షిణలు చేసి స్వామివారి ప్రసాదం కొడి ముద్దను స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఇందుకోసం సుమారు వంద మందికిపైగా మహిళలకు కొడిముద్దను అందజేశారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మహిళలు వచ్చి కొడిముద్ద ప్రసాదం స్వీకరించారు.

మృతుడికి నివాళి



ఆవుల చిన్న ఓబయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని బొప్పాపురానికి చెందిన ఆవుల చిన్న ఓబయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వారి నివాసం వద్దకు చేరుకుని చిన్న ఓబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారులు ఆవుల గోపాల్, ఆవుల ప్రహ్లాదలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసి బాలయ్య, నాయకులు కందాటి రాజారెడ్డి, తుపాటి చెంచయ్య, కూనా మల్లికార్జున్, మురళి, మేకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.